సాక్షి రాజన్న సిరిసిల్ల

శనివారం । 19 । ఆగస్టు । 2023



ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించండి

సిరిసిల్లఅర్బన్: రెండో ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకుడు కె.కె.మహేందర్‌రెడ్డి కోరారు. సిరిసిల్లలో దీక్షాశిబిరంలో సంఘీభావం తెలిపారు.



మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

వేములవాడ: రాజన్న అనుబంధ మహాలక్ష్మీ ఆలయంలో శ్రావణమాసం మొదటి శుక్రవారం పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
28.0/23.0

వాతావరణం

జిల్లాలో తేలికపాటి వర్షం జల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వేములవాడ కోర్టులో ఆన్‌లైన్ సాక్ష్యం

- జూమ్ ద్వారా వీడియో రికార్డింగ్



డాక్టర్ సుశ్వేతతో జూమ్‌లో సాక్ష్యం తీసుకుంటున్న సబ్‌జడ్జి సట్టు రవీందర్

వేములవాడ: వేములవాడ సబ్ కోర్టులో శుక్రవారం జూమ్ ద్వారా సాక్ష్యాన్ని తీసుకున్నట్లు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గౌరు రాజిరెడ్డి తెలిపారు. రెండు కేసుల్లో వాంగ్మూలం ఇవ్వాల్సిన డాక్టర్ సుశ్వేత గర్భిణి కావడంతో కోర్టుకు హాజరయ్యే పరిస్థితులు లేకపోవడంతో ఆన్‌లైన్ ద్వారా జూమ్‌లో వీడియో వాంగ్మూలాన్ని సబ్‌కోర్టు జడ్జి సట్టు రవీందర్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గౌరు రాజిరెడ్డి, అడ్వకేట్లు రఘురామన్, నక్క దివాకర్ సమక్షంలో రికార్డు చేశారు. ఇలాంటి సాక్ష్యం సబ్ కోర్టులో మొదటిసారి జరిగినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. చందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హత్యాయత్నం కేసు, బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేధింపులతో అమ్మాయి ఆత్మహత్య కేసు బాధితులకు వైద్యురాలు సుశ్వేత చికిత్స చేసినట్లు పీపీ తెలిపారు. ఆ సంఘటనలు జరిగిన సమయంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రిలో డాక్టర్ సుశ్వేత విధులు నిర్వహించారని, ప్రస్తుతం ఆమె జడ్చర్ల ఆస్పత్రికి బదిలీపై వెళ్లినట్లు చెప్పారు.

నిరుపేదలకు వరం సీఎమ్మార్‌ఎఫ్



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఆపద సమయంలో నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరంగా మారిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు బందారి బాల్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ నాగరాణి, అనసూయ, నాయకులు పర్శరాములు, అప్సరాఉన్నీసా, శివరామకృష్ణ ఉన్నారు.

రైతుల పక్షపాతి కేసీఆర్



గంభీరావుపేట(సిరిసిల్ల): సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమానికి, వ్యవసాయ అభివృద్ధికి కృషి చేస్తున్నారని టెస్కాబ్ రవీందర్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల పంట రుణాలను మాఫీ చేసిన సందర్భంగా గంభీరావుపేటలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ వంగ కరుణ, సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ రామానుజగౌడ్, వైస్ ఎంపీపీ లత, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు వెంకటయాదవ్ ఉన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రభుత్వం తక్షణమే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. ముస్తాబాద్ మండలం చీకోడు, నామాపూర్ గ్రామాల్లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు శుక్రవారం చేపట్టారు. శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సీపీఎస్ విధానంతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వెంటనే పీఆర్‌సీ ప్రకటించాలని కోరారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు వెల్మల బుచ్చిరెడ్డి, శివశంకర్, బాలకిషన్, పర్శరాములు, ప్రభాకర్, స్వామి ఉన్నారు.

మాజీ సర్పంచుల డిమాండ్లు నెరవేర్చాలి

సిరిసిల్లఅర్బన్ : మాజీ సర్పంచుల డిమాండ్లు నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరాహార దీక్ష చేపడుతున్న మాజీ సర్పంచులకు శుక్రవారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. పది రోజులుగా మాజీ సర్పంచులు దీక్ష చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. దీక్షలో వాసాల వెంకట్రామిరెడ్డి, బుర్ర మల్లేశంగౌడ్, సుజాత, రాజమల్లయ్య, నారాయణ ఉన్నారు.

పర్యాటకంగా అభివృద్ధి



గౌడ సంఘానికి స్థలం పత్రాలు అందిస్తున్న మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్



బోటుపై విహరిస్తున్న మంత్రులు, నాయకులు

- కోనసీమ, పాపికొండలకు దీటుగా సిరిసిల్ల అందాలు
- ప్రతీ గ్రామంలో ఈత, తాటి వనాలకు స్థలాలు
- గౌడ భవన నిర్మాణానికి రూ.2కోట్లు
- సిరిసిల్ల గౌడన్నలకు సేఫ్టీ మోకులు
- మంత్రి కేటీఆర్
- శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి బోటింగ్ ప్రారంభం, పాపన్న విగ్రహావిష్కరణ



బోటు సేవలు ప్రారంభిస్తున్న మంత్రులు



సభకు హాజరైన జనం

సిరిసిల్లటౌన్: జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని మున్సిపల్, పరిశ్రమలు, ఐటీశాఖల మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. సిరిసిల్లలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఆవిష్కరణ, మిడ్‌మానేరు బ్యాక్ వాటర్‌లో బోటింగ్ యూనిట్లను మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మిడ్‌మానేరు ద్వారా జిల్లాలోని మానేరునది, చెరువులు, కుంటల్లో ఏడాది పొడవునా నీరుంటుందన్నారు. తెలంగాణ పోరాటం మాదిరిగానే ఆరోజుల్లో పాపన్న ఆత్మగౌరవ పోరాటం చేపట్టారన్నారు. పాపన్న మాదిరిగానే కేసీఆర్ సైతం తెలంగాణ పోరాటాన్ని కొద్దిమందితో ప్రారంభించి ఇప్పుడు అదే గోల్కొండ కోటపై జెండా ఎగురవేశారన్నారు.

గౌడన్నలకు కేటీఆర్ వరాలు

సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం సంతోషంగా ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. సిరిసిల్ల గౌడులకు సేఫ్టీ మోకులు అందిస్తామని, జిల్లా, మండల కేంద్రాలకు నీరా సెంటర్లను విస్తరింపజేస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో ఈత, తాటి, కర్జూర వనాల పెంపునకు ప్రభుత్వ స్థలాలు కేటాయించాలని కలెక్టర్ అనురాగ్ జయంతిని ఆదేశించారు. సిరిసిల్లలో నిర్మించే గౌడసంఘం భవనానికి రూ.2కోట్లను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతులు మీదుగా అందజేశారు.

కులవృత్తులు బాగుపడాలి

టాటా.. బిర్లాలే కాదు కులవృత్తులు బాగుపడాలనేదే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయమని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. బడుగు, బలహీనవర్గాల మెరుగైన విద్యకోసం రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి గురుకులాలు, జూనియర్ కాలేజీలను ఏర్పాటు చేసిన ఏకైక రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. సాగు, తాగునీటి కష్టాలను శాశ్వతంగా దూరం చేశామన్నారు. వచ్చే నెలలో మల్కపేట రిజర్వాయర్‌ను సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని తెలిపారు. కోనసీమ, పాపికొండలకు దీటుగా సిరిసిల్ల మానేరు పరివాహక ప్రాంతాలు అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, సెస్‌చైర్మన్ చిక్కాల రామారావు, గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్, జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్, కార్యదర్శి బుర్ర నారాయణగౌడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

నేతన్న..గీతన్నలది అవినాభావ సంబంధం : మంత్రి శ్రీనివాస్‌గౌడ్



నేతన్న..గీతన్నలను అవినాభావ సంబంధమని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వెనుకబడిన కులవృత్తులను అభివృద్ధి పరిచేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. ఉమ్మడి పాలనలో మూతబడిన కల్లు దుకాణాలను తెరిపించారని, రూ.3కోట్లతో హైదరాబాద్ ట్యాంకుబండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటుకు అనుమతించి గౌడుల ఆత్మగౌరవానికి కేసీఆర్ ప్రాధాన్యతనిచ్చారని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలో వేలాది మంది గీత, నేతకార్మికులు చనిపోతే పట్టించుకున్న పాపాన పోలేదని ఇప్పుడు వారికి ఎలాంటి కష్టాలు రాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగుతోందన్నారు. రానున్న మూడేళ్లలో సిరిసిల్ల చుట్టుపక్కల పల్లెల్లో అత్యధిక సినిమాలు షూటింగ్స్ జరుపుకోవడం తథ్యమన్నారు. మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యంతో అభివృద్ధిలో ముందుంటున్న సిరిసిల్ల ప్రజలు అదృష్టవంతులుగా పేర్కొన్నారు. గౌడ జాతికి సీఎం కేసీఆర్ ఎంతో చేశారని, ఆయనకు గౌడజాతి ఎల్లవేళలా అండగా నిలుస్తారని స్పష్టం చేశారు.

వీరత్వానికి ప్రతీక సర్వాయి పాపన్న



సిరిసిల్లఅర్బన్: సర్దార్ సర్వాయి పాపన్న తెలంగాణ వీరత్వానికి ప్రతీక అని కలెక్టర్ అనురాగ్ జయంతి కొనియాడారు. కలెక్టరేట్‌లో సర్వాయి పాపన్న జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సబ్బండ వర్గాలను కలుపుకొని నిరంకుశ శక్తులపై పాపన్నగౌడ్ పోరాడారన్నారు. ఆయన జీవితం మనకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్‌లు సత్యప్రసాద్, ఖీమ్యా నాయక్, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ గంగయ్య, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రాఘవేంద్ర, శ్రీనివాసాచారి, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి జితేందర్‌రెడ్డి, కొమురయ్య, భాస్కర్, జిల్లా పౌరసంబంధాల అధికారి దశరథం, గౌడసంఘం సభ్యులు పాల్గొన్నారు.

నర్సింగ్ కాలేజీ ఆకస్మిక తనిఖీ

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్లలోని నర్సింగ్ కళాశాలను కలెక్టర్ అనురాగ్ జయంతి శుక్రవారం తనిఖీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. హాస్టల్‌మెస్‌ను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెస్ నిర్వహణపై ఆరా తీశారు. కళాశాలలో ఒకే బోరు ఉండడటంతో ఇబ్బందులు పడుతున్నామని, ఆసుపత్రికి వెళ్లేందుకు రెండు బస్సులే ఉన్నాయని కలెక్టర్ దృష్టికి విద్యార్థినులు తీసుకొచ్చారు. అదనంగా బోరు మంజూరు చేస్తామని, అవసరమైతే ఆర్టీసీ బస్సులను అద్దెకు తెప్పిస్తామని కలెక్టర్ తెలిపారు. హాస్టల్‌కు చపాతి మేకర్‌ను అందజేస్తామని హామీ ఇచ్చారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ తదితరులు ఉన్నారు.

గృహలక్ష్మి సర్వే

రుద్రంగి(వేములవాడ): మండలంలోని గృహలక్ష్మి దరఖాస్తుల సర్వే రెండో రోజు శుక్రవారం కొనసాగుతోంది. దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. రుద్రంగి ఎంపీడీవో మాలోతు శంకర్, ఎంపీవో సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టెండర్ల కిక్కు.. లక్కు ఎవరికో?

- 48 దుకాణాలు.. 2,032 దరఖాస్తులు
- టెండర్ దాఖలుచేసిన 511 మంది మహిళలు
- ప్రభుత్వ ఖజానాకు రూ.40.64కోట్లు
- రుద్రంగికి అత్యల్పం



టెండర్ వేసేందుకు ఎదురుచూస్తున్న వ్యాపారులు

21న లక్కీ డ్రా

జిల్లాలోని 48 మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తులను నిర్ణీత నిబంధనల మధ్య ఈనెల 21 కలెక్టరేట్ ఆవరణలో లక్కీ డ్రా తీస్తాం. దరఖాస్తులు చేసిన వారు వారికిచ్చిన గుర్తింపు పత్రాన్ని జాగ్రత్తగా ఉంచుకోవాలి.

– పంచాక్షరీ, జిల్లా ఎక్సైజ్ అధికారి

సిరిసిల్లక్రైం: వైన్‌షాపులు దక్కించుకునేందుకు చివరి రోజు శుక్రవారం పోటాపోటీగా టెండర్లు దాఖలు చేశారు. ఒక్క రోజే 879 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో 48 వైన్‌షాపులకు శుక్రవారం రాత్రి వరకు 2,032 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మద్యం షాపులకు 511 మంది మహిళలు టెండర్లు దాఖలు చేశారు.

ఇల్లంతకుంటకు అత్యధికం

సిరిసిల్ల సర్కిల్‌లోని 18 మద్యం దుకాణాలకు 899 దరఖాస్తులు, ఎల్లారెడ్డిపేట సర్కిల్‌లోని 14 దుకాణాలకు 569, వేములవాడ సర్కిల్‌లో 16 మద్యం దుకాణాలకు 564 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇల్లంతకుంట వైన్స్‌కు అత్యధికంగా 84 దరఖాస్తులు వచ్చాయి. వేములవాడ సర్కిల్‌లోని గెజిట్‌నంబర్ 26 వేములవాడటౌన్ వైన్స్‌కు 69 దరఖాస్తులు, ఎల్లారెడ్డిపేట సర్కిల్‌లో 40వ గెజిట్‌షాపునకు 60 దరఖాస్తులు దాఖలయ్యాయి. అత్యల్పంగా రుద్రంగి రెండు వైన్స్‌లకు తలా 11 దరఖాస్తులు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. పది కంటే తక్కువ దరఖాస్తులు వచ్చిన దుకాణాలకు రీషెడ్యూల్ ప్రకటించి దరఖాస్తులను ఆహ్వానించే అవకాశాలు ఉంటాయని సమాచారం. గతేడాది ఇవే వైన్స్‌కు దరఖాస్తులు తక్కువ వచ్చాయని మళ్లీ టెండర్స్ పిలిచారు.



రాజన్నకు శ్రావణశోభ

వేములవాడ: రాజన్న సన్నిధిలో శ్రావణమాసం వేడుకల సందడి పెరిగింది. మొదటి శుక్రవారం సందర్భంగా దాదాపు 20 వేల మంది భక్తులు రాజన్నను, అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పరిశీలించారు.

మూగబోయిన శాస్త్రులపల్లి

- మావోయిస్టు నేత మీసాల రాజిరెడ్డి మృతి?
- అంచలంచెలుగా అగ్రశ్రేణి నాయకుడిగా..
- మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కేరళ రాష్ట్రాల్లో తనదైన ముద్ర
- చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్న స్నేహితులు



భారీ పోలీసు బందోబస్తు మధ్య కోర్టుకు హాజరైన మావోయిస్ట్ అగ్రనేత రాజిరెడ్డి(ఫైల్)

మంథని: మరో ఉద్యమ కెరటం నేలవాలింది. నాలుగున్నర దశాబ్దాల అజ్ఞాత జీవితానికి తెరపడింది. మారుమూల మంథని గడ్డపై పుట్టి, విప్లవోద్యమాల వైపు ఆకర్శితుడై, చిన్నతనంలోనే పీడిత సమాజం కోసం అడుగులు వేశాడు.. 1975లో మంథనిలో ఇంటర్ చదువుతుండగా రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో చేరిన విప్లవకారుడు మల్లా రాజిరెడ్డి ఉరఫ్ మీసాల రాజిరెడ్డి, సంగ్రామ్ ఉరఫ్ సాయన్న, అలోక్, దేశ్‌పాండే అలియాస్ గోపన్న అనారోగ్యంతో ఈనెల 16న మరణించినట్లు వార్తలు రావడంతో ఆయన సహచరులు కన్నీరు పెట్టుకుంటున్నారు. మావోయిస్టు పార్టీ గానీ ఇటు పోలీసులు, కుటుంబసభ్యులు ఆయన మృతిని ధ్రువీకరించలేదు. రాజిరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని దండకారణ్యంలో మావోయిస్టు గెరిల్లా దళాల ఏర్పాటులో కీలక భూమిక పోషించారు. మావోయిస్టు కేంద్ర కమిటీ మాజీ కార్యదర్శి ముప్పాల లక్ష్మణరావుకు సమకాలీకుడిగా పేరున్న రాజిరెడ్డి ఇక లేరన్న వార్త నాలుగు రాష్ట్రాల దండకారణ్య ప్రాంతాల్లో విషాదం నింపింది.

కొండపల్లి స్ఫూర్తితో ఉద్యమ బాట

మంథని మండలం ఎక్లాస్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధి శాస్త్రులపల్లికి చెందిన మల్లా రాధమ్మ(రాజమ్మ)–వెంకట్‌రెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకొడుకు రాజిరెడ్డి, చిన్నకొడుకు భీమారెడ్డి. 1975లో గ్రామంలో జరిగిన ఓ సంఘటనలో రాజిరెడ్డిపై కేసు నమోదై, జైలుకు వెళ్లాడు. వరంగల్ జైలులో ఉన్న సమయంలో పీపుల్స్‌వార్ వ్యవస్థాపకుడు కొండపల్లి సీతారామయ్య వర్గానికి చెందిన వారితో పరిచయం ఏర్పడింది. జైలు జీవితం తర్వాత కొండపల్లి స్ఫూర్తితో ఉద్యమబాట పట్టాడు.

సింగరేణి ఉద్యోగం కాదని..

రాజిరెడ్డితోపాటు ఆయన సోదరుడు భీమారెడ్డికి సింగరేణిలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో చేరాలని తండ్రి సూచించగా.. రాజిరెడ్డి తన కాల్ లెటర్ చించేసి, విప్లవోద్యమం వైపు వెళ్లగా, సోదరుడు సింగరేణి ఉద్యోగం చేసి, విరమణ పొందాడు.

మేనమామ కూతురితో వివాహం

రాజిరెడ్డి తన మేనమామ రామగిరి(అప్పుడు ముత్తారం) మండలంలోని రామయ్యపల్లికి చెందిన మట్ట కృష్ణారెడ్డి కూతురు రత్నమ్మను వివాహం చేసుకున్నాడు. రాజిరెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లిన తర్వాత పోలీసుల వేధింపులు పెరగడంతో ఆమె సైతం 1982లో పీపుల్స్‌వార్ పార్టీలోకి వెళ్లినట్లు బంధువులు తెలిపారు. అక్కడే వారికి కూతురు స్నేహలత జన్మించడంతో ఆరేళ్ల వయసులో పాపను సోదరుడి చేతిలో పెట్టారు. ఆయన పెంచి పెద్దచేసి, చదివించాడు. తీవ్ర నిర్బంధంలో మంథనిలోని ఎకరంన్నర భూమి అమ్మి, మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో కాసీంతో పెళ్లి చేశారు. స్నేహలత న్యాయవాదిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. రత్నమ్మ మరణించిన తర్వాత రాజిరెడ్డి అజ్ఞాతంలోనే బీచ సుగుణ ఉరఫ్ సంగీతను పెళ్లి చేసుకున్నట్లు సమాచారం.

తల్లిదండ్రుల కడసారి చూపునకు రాలే..

రాజిరెడ్డి తండ్రి 25 ఏళ్ల క్రితం చనిపోయారు. పోలీస్ నిఘా తీవ్రంగా ఉండడంతో తండ్రిని కడసారి చూసుకునేందుకు రాలేకపోయారు. తల్లి రాజమ్మ 2013లో అనారోగ్యంతో మృతిచెందగా అప్పుడూ రాలేదు. కానీ రెండు నెలల మాసికం రోజు సమీపంలోని అటవీ ప్రాంతానికొచ్చి, తన కుటుంబసభ్యులను పిలిపించుకొని మాట్లాడినట్లు సమాచారం.

రెండుసార్లు అరెస్టు

31–01–1950లో జన్మించిన రాజిరెడ్డి రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో కేంద్ర కమిటీ సభ్యుడి స్థాయికి ఎదిగారు. 1988లో ధర్మపురిలో తొలిసారి, 2007 డిసెంబర్ 14న కేరళలోని ఎర్నాకులం వద్ద రెండోసారి అరెస్టయ్యారు. 18 నెలల జైలు జీవితం గడిపిన రాజిరెడ్డి మళ్లీ 2009 అక్టోబర్ 7న అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లో అనేక సంఘటనల్లో కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుతం కేంద్ర కమిటీ సభ్యుడిగా, ఆంధ్ర, ఒడిశా బార్డర్ దండకారణ్య సెక్రటరీగా ఉన్నట్లు సమాచారం. రాజిరెడ్డిపై మహదేవపూర్ మండలం అన్నారం అడవుల్లో మాజీ స్పీకర్ శ్రీపాదరావు హత్య కేసుతోపాటు కరీంనగర్ ఠాణా పరిధిలో ఓ హత్య కేసు నమోదయ్యాయి. పెద్దపల్లిలో 9, దేశవ్యాప్తంగా 40కి పైగా కేసులు ఉన్నట్లు సమాచారం. ఆయనపై రాష్ట్రంలో రూ.25లక్షలు, ఆయా రాష్ట్రాల్లో మరో రూ.75 లక్షల నజరానా ఉంది.

ప్రజలకు ఖచ్చితమైన సమాచారం అందివ్వాలి

- అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్
- సిరిసిల్లలో మీడియా వర్క్‌షాప్



వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్

సిరిసిల్లటౌన్: ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల బాధ్యత గొప్పదని ప్రజలకు ఖచ్చితమైన సమాచారం అందించడంలో అప్రమత్తంగా పనిచేయాలని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ పేర్కొన్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) ఆధ్వర్యంలో సిరిసిల్ల లహరి గ్రాండ్ ఫంక్షన్‌హాలులో శుక్రవారం జర్నలిస్టులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఖీమ్యానాయక్ మాట్లాడుతూ తప్పుడు వార్తలు ప్రచురింపకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. పీఐబీ జాయింట్ డైరెక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ జర్నలిస్టులు భారత ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలను తెలుసుకునేందుకు వీలుగా పీఐబీ వర్క్‌షాప్‌ను ఔట్‌రీచ్ యాక్టివిటీ ప్రోగ్రామ్ నిర్వహిస్తుందన్నారు. పీఐబీ హైదరాబాద్ మీడియా ఆఫీసర్ ఓరగంటి గాయత్రీ 'వార్తాలాప్' లక్ష్యాన్ని వివరించారు. సీనియర్ జర్నలిస్టు ఎస్.రాము జర్నలిజంలో ఉత్తమ విధానాలు అంశంపై, ఇటిక్యాల నరేశ్ సైబర్ సెక్యూరిటీపై సెషన్లను నిర్వహించారు. వివిధ అంశాల్లో జిల్లా జర్నలిస్టుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డీపీఆర్‌వో మామిండ్ల దశరథం, 100 మందికి పైగా జర్నలిస్టులు పాల్గొన్నారు. అనంతరం అతిథులను పీఐబీ ఆధ్వర్యంలో సన్మానించారు.

వేములవాడలో వేడెక్కిన రాజకీయం

- బీఆర్ఎస్‌లో టిక్కెట్టు కోసం పోటాపోటీ
- ఎమ్మెల్యే రమేశ్‌బాబు జర్మనీ నుంచి స్థానిక నేతలతో వీడియో కాన్ఫరెన్స్
- నేడు చల్మెడ లక్ష్మీనరసింహారావు స్పెషల్ మీటింగ్
- పట్టణంలో వెలసిన వాల్‌పోస్టర్లు



వేములవాడలో చల్మెడ వాల్‌పోస్టర్

వేములవాడ: వేములవాడ బీఆర్ఎస్‌లో రాజకీయాలు వేడెక్కాయి. రానున్న ఎన్నికల్లో టికెట్ కేటాయింపుపై చర్చలు జోరుగా సాగుతున్నాయి. తమకే.. తమకే టికెట్ దక్కుతుందని పోటాపోటీగా కార్యక్రమాలు చేపడుతున్నారు. సిట్టింగులకు టిక్కెట్లు ఇచ్చే అంశంలో వేములవాడ సిట్టింగ్ ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు టికెట్ దక్కుతుందా? లేదా? అనే చర్చ జోరందుకుంది. జర్మనీ వెళ్లిన రమేశ్‌బాబు శుక్రవారం నియోజకవర్గంలోని ముఖ్య నేతలతో సంగీత నిలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడినట్లు తెలిసింది. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన వెంటనే ఆ నాయకులందరూ సిరిసిల్లకు వచ్చిన మంత్రి కేటీఆర్‌ను కలిసేందుకు యత్నించినట్లు ప్రచారం సాగుతోంది.

పోటాపోటీగా పోస్టర్లు

బీఆర్ఎస్ నాయకుడు చల్మెడ లక్ష్మీనర్సింహారావు పేరుతో వేములవాడలో ప్రభుత్వ పథకాలతో కూడిన వాల్‌పోస్టర్లు, వాల్‌స్టిక్కర్లు దర్శనమిస్తున్నాయి. టికెట్ల వ్యవహారం చర్చనీయాంశమైన క్రమంలో వాల్‌పోస్టర్లు వెలవడం చర్చకు దారితీసింది.

నేడు చల్మెడ కార్యాలయంలో సమావేశం

బీఆర్ఎస్ పార్టీ నాయకుడు చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఇటీవల వేములవాడలోని మల్లారం జంక్షన్‌లో ప్రారంభించిన పార్టీ కార్యాలయంలో తన ముఖ్య నాయకులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. భవిష్యత్ కార్యచరణపై చర్చించనున్నట్లు తెలిసింది. దీంతో సిట్టింగుకు టిక్కెట్టా? లేక చల్మెడకు టిక్కెట్టా? అనే చర్చ ఊపందుకుంది. దీనిపై జోరుగా బెట్టింగులు జరుగుతున్నట్లు ప్రచారంలో ఉంది.

ప్రతీ చిత్రం.. ఓ జ్ఞాపకం

- చరిత్రను సజీవంగా నిలిపేది.. ఎన్నో భావాలను తెలిపేది ఫొటో
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం
- ఉమ్మడి జిల్లాలో ఫొటోగ్రఫీలో రాణిస్తున్న పలువురు మహిళలు

కరీంనగర్ కల్చరల్: ప్రతీ క్షణాన్ని ఒక మధుర జ్ఞాపకంగా చూపించగలిగేది, కాలం గర్భంలో కలిసిన చరిత్రను సజీవంగా నిలిపేది, ఎన్నో జ్ఞాపకాలను ఎప్పటికీ మన కళ్లముందుంచేది ఫొటో. ఎన్నో భావాలను ఒక్క చిత్రంతో తెలిపే గొప్పదనం ఒక్క ఫొటోగ్రఫీకే ఉంది. ఈ ఆధునిక కాలంలో దానికి మానవ జీవితంతో విడదీయలేని బంధం ఉంది. రసాయనాలతో రూపొందించిన ప్లేటుపై కాంతిచర్యతో ఓ రూపాన్ని బంధించడాన్ని ఫొటోగ్రఫీ అంటారు. క్లుప్తంగా చెప్పాలంటే కాంతితో చిత్రాన్ని గీయడం. నేడు అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలువురు మహిళలు ఫొటోగ్రఫీలో తమ ప్రత్యేకత చాటుకుంటున్నారు.



గోల్డ్ మెడల్‌కు ఎంపికైన ఫొటో

కేదార్‌రెడ్డి ఫొటోకు గోల్డ్ మెడల్



కేదార్‌రెడ్డి

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంతర్జాతీయ స్థాయిలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల ఇంటర్నేషనల్ సిలన్ వారు ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించారు. దేశ, విదేశాల నుంచి 220 మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఇందులో కరీంనగర్‌కు చెందిన సిగ్మా ఫొటో స్టూడియో నిర్వాహకుడు మహిమల కేదార్‌రెడ్డి గోల్డ్ మెడల్‌కు ఎంపికయ్యారు. ఆయన తీసిన చిన్నారిని ఎత్తుకున్న తల్లి బ్లాక్ అండ్ వైట్ చిత్రం అవార్డు దక్కించుకుంది. ఈ పోటీల్లోనే కలర్ విభాగంలో రిబ్బన్ అవార్డుకు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 20న మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ స్టేడియంలో అవార్డు అందించనున్నారని, ఈ మేరకు శుక్రవారం సమాచారం అందిందని పేర్కొన్నారు.

నా భర్త దగ్గరే నేర్చుకున్న

– కటుకం స్రవంతి, చైతన్య డిజిటల్ ఫొటో స్టూడియో

నేను కరీంనగర్ మహిళా డిగ్రీ కళాశాలలో 2006లో డిగ్రీ పూర్తి చేశా. 2007లో ఫొటోగ్రాఫర్ సుధాకర్‌తో వివాహం జరిగింది. 2008 నవంబర్ 2న చైతన్య డిజిటల్ ఫొటో స్టూడియో ప్రారంభించాం. నా భర్త దగ్గరే ఫొటోలు తీయడం నేర్చుకున్న. మాకు ఇద్దరు కుమారులు. 2014లో భర్త అనారోగ్యంతో చనిపోయారు. కుటుంబ పోషణకు ఫొటోగ్రాఫర్‌గా మారాను. ఇప్పటివరకు 30 వెడ్డింగ్ ఈవెంట్స్ చేశా. 2023లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అప్పటి కలెక్టర్ కర్ణన్ చేతుల మీదుగా సన్మానం పొందాను.



స్రవంతిని సన్మానిస్తున్న కలెక్టర్ కర్ణన్ (ఫైల్)



అవార్డు అందుకుంటున్న తులసి

ఫొటోలు తీస్తూ.. ఆల్బమ్స్ తయారీ

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): పెద్దపల్లి జిల్లా యైటింక్లయిన్ కాలనీకి చెందిన డీవీఆర్ తులసి తండ్రి వెంకటరమణ ప్రోత్సాహంతో ఫొటోగ్రఫీపై మక్కువ పెంచుకుంది. ఆయన డీవీఆర్ పేరుతో ఫొటోస్టూడియో ప్రారంభించగా పెళ్లిళ్లు, పుట్టిన రోజు కార్యక్రమాల్లో ఫొటోలు తీస్తూ ఆల్బమ్స్ తయారు చేస్తోంది. 2020–21లో శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి డీకే అరుణ చేతులమీదుగా శ్రీ దాత్రి పురస్కారం అందుకుంది. గతేడాది రాష్ట్రస్థాయి పోటీల్లో బెస్ట్ వెడ్డింగ్ ఫొటోగ్రఫీ అవార్డు గెలుచుకుంది. తెలంగాణ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేస్తోంది.

జమ్మికుంట ఫొటోగ్రాఫర్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న అరుణ్‌కుమార్

జమ్మికుంట: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం విజయవాడలో ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మికుంట పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ వడ్లూరి అరుణ్‌కుమార్‌కు జాతీయ స్థాయిలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీ ఆనర్ అవార్డును ముఖ్య అతిథులు డాక్టర్ జేబీ రావు, ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి, మండలి మాజీ ఉప సభాపతి బుద్ధ ప్రసాద్, పార్లమెంట్ మాజీ సభ్యుడు గోకరాజుల చేతులమీదుగా అందజేశారు. ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆయనను అభినందించారు.

భర్త ప్రోత్సాహంతో స్టూడియో



శ్రీలలిత

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని తిరుమల్‌నగర్‌కు చెందిన కాటారపు శ్రీలలిత పదో తరగతి వరకు చదువుకుంది. డిజిటల్ కెమెరాల్లో అద్భుతమైన ఫొటోలు తీస్తోంది. భర్త సంతోష్ టైలరింగ్ పని చేస్తున్నాడు. మొదట్లో ఆయనకు ఆర్థికంగా తోడుగా ఉండేందుకు ఓ ఫొటో ల్యాబ్‌లో రిసెప్షనిస్టుగా ఏడేళ్లు పని చేసింది. రెండేళ్ల క్రితం భర్త, అత్తామామ ప్రోత్సాహంతో రూ.3 లక్షలు అప్పు చేసి, శ్రీలలిత డిజిటల్ స్టూడియో ఏర్పాటు చేసింది. పెళ్లిళ్లు, పుట్టిన రోజు తదితర కార్యక్రమాల్లో ఫొటోలు తీస్తోంది. భర్తతోపాటు మరో ఇద్దరు పేదలకు ఉచితంగా ఫొటోగ్రఫీ నేర్పిస్తోంది.

నాన్న ఆర్టిస్ట్ కావడంతో..



కొండగట్టులో స్రవంతికి సన్మానం (ఫైల్)

కరీంనగర్ కల్చరల్: నాన్న పాశం వరద రాజు ఆర్టిస్ట్. అందువల్ల నాకు ఫొటోగ్రఫీపై ఇష్టం ఏర్పడింది. నెగెటివ్ ప్రింటింగ్, ఫ్లెక్సీ, రోల్స్ డెవలపింగ్, ఫొటోగ్రాఫిక్స్, ఆల్బమ్ క్రియేషన్ నేర్చుకున్న. నా భర్త శ్రీనివాస్ సపోర్ట్‌తో 2021లో శ్రీలక్ష్మీగణపతి స్టూడియో ప్రారంభించా. మాకు ఇద్దరు అబ్బాయిలు. 2022లో జీఆర్ మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ వారు కొండగట్టులో నన్ను సన్మానించారు. ప్రస్తుతం ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ మహిళా విభాగం కరీంనగర్ పట్టణ జాయింట్ సెక్రటరీగా ఉన్నాను.

– గాలిపెల్లి స్రవంతి, శ్రీలక్ష్మీగణపతి డిజిటల్ ఫొటో స్టూడియో

ఎల్లలు దాటిన నాన్నమ్మ ఫొటో



మమత



మమత తీసిన ఫొటో

సిరిసిల్లకల్చరల్: కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం బంకెపల్లికి చెందిన గుగులోతు మమత తంగళ్లపల్లి గిరిజన సంక్షేమ గురుకుల మహిళా కళాశాలలో ఫ్యాషన్ టెక్నాలజీ డిగ్రీ చదువుతోంది. ఆమెకున్న ఫొటోగ్రఫీ అభిరుచిని తండ్రి భీమానాయక్ ప్రోత్సహించారు. మమత తీసిన సంప్రదాయ దుస్తుల్లో ఉన్న తన నాన్నమ్మ ఫొటో ఇటీవల అంతర్జాతీయ ఫొటో మ్యాగజైన్ వోగ్ ఇటాలియా ముఖచిత్రంగా ముద్రితమైంది. దీంతో మంత్రి కేటీఆర్ ఆమెను ట్విట్టర్ వేదికగా ప్రశంసించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి జ్ఞాపిక అందజేసి, అభినందించారు.

1,200కు పైగా లఘుచిత్రాలకు కెమెరాఉమెన్



ఈ మొగుళ్లు మాకొద్దు లఘుచిత్రంలోని స్టిల్



అనితారాజ్

విద్యానగర్(కరీంనగర్): చొప్పదండికి చెందిన అనితారాజ్‌కు ఫొటోగ్రఫీపై మక్కువ. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ షార్ట్ ఫిల్మ్ కెమెరాఉమెన్‌గా తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ అద్భుత చిత్రాలను అందిస్తోంది. ఏఆర్‌ఎస్ క్రియేషన్స్ యూట్యూబ్ చానల్ స్టోరీ రైటర్‌గా, డైరెక్టర్‌గా, ఎడిటర్‌గా చేస్తోంది. ఇప్పటివరకు 1200కు పైగా లఘుచిత్రాలకు కెమెరాఉమెన్‌గా పని చేసింది. ఉత్తమ కెమెరాఉమెన్‌గా పలు సంస్థల నుంచి అవార్డులు అందుకుంది. ఈ మొగుళ్లు మాకొద్దు లఘుచిత్రంలోని స్టిల్‌కు రాష్ట్రస్థాయి అవార్డు వచ్చింది.

కొదురుపాకలో యువకుడి బలవన్మరణం

బోయినపల్లి(చొప్పదండి): మానసిక స్థితి సరిగా లేని యువకుడు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాలు. మండలంలోని కొదురుపాకకు చెందిన బొల్లవేని మహేశ్(32)కు సిరికొండకు చెందిన మానసతో వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుళ్లు. ఏడాదిన్నరగా మహేశ్ మానసిక పరిస్థితి సరిగ్గా లేక తరచూ భార్యను కొడుతుండేవాడు. మహేశ్ కుటుంబీకులు మానసను భర్త మానసిక స్థితి బాగయ్యాక రావాలని తల్లి గారిల్లు సిరికొండ పంపించారు. మహేశ్‌ను కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించగా మందులు వాడుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మహేశ్ తండ్రి బొల్లవేణి ఎల్లయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ వివరించారు.

అనారోగ్యంతో వ్యాపారి మృతి

సిరిసిల్లఅర్బన్: ప్రముఖ వస్త్ర వ్యాపారి, గీతా ప్రచార సేవా సమితి ఉపాధ్యక్షుడు అంకారపు శ్రీహరి అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. ఆయన మృతిపట్ల సీనియర్ సిటిజన్ జిల్లా గీతా ప్రచార సేవాసమితి సభ్యులు నివాళులర్పించి సంతాపం ప్రకటించారు.

రేవంత్‌కు భద్రత కల్పించాలి

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట (వేములవాడ): నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రతిపక్ష నాయకుడికి భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, ఎంపీ రేవంత్‌రెడ్డికి భద్రతను తొలగించడం ద్వారా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనైతిక చర్యలకు పాల్పడుతోందని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని చూసి సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వం భయపడుతోందన్నారు. రేవంత్‌రెడ్డి భద్రత విషయంలో మొదటినుంచి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. గత ఎన్నికల సమయంలో సీఆర్‌పీఎఫ్ సెక్యూరిటీ కల్పించాలని హైకోర్టు ఆదేశించగా కొంతకాలం సెక్యూరిటీ ఇచ్చిన ప్రభుత్వం తర్వాత తీసేసిందన్నారు. ఎంపీగా గెలిచిన తర్వాత ఎనిమిది మంది గన్‌మెన్లను ఇచ్చి పీసీసీ చీఫ్ అయ్యాక భద్రత పెంచాల్సింది పోయి నాలుగుకు తగ్గించారన్నారు. తక్షణమే భద్రతను కల్పించాలన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, మాజీ జెడ్పీటీసీ రుక్మిణీ, నాయకులు గోపాల్, ప్రభాకర్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై బీఎస్పీ పోరాటం

బోయినపల్లి(చొప్పదండి): ప్రజా సమస్యలపై బీఎస్పీ పోరాడుతుందని, నియోజకవర్గంలోని ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు గుడ్‌మార్నింగ్ చొప్పదండి పేరిట కొత్త కార్యక్రమం చేపడుతున్నట్లు బీఎస్పీ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జి కొంకటి శేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రామన్నపేటలో జిల్లా కమిటీ సభ్యుడు మాంకాళి తిరుపతి, మండల కమిటీ సభ్యులతో కలిసి ఇంటింటా తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను సీఎం చేయడమే బీఎస్పీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, ఇల్లెందుల అరుణ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి రిమాండ్

వేములవాడరూరల్: హత్యాయత్నం కేసులో తప్పించుకొని తిరుగుతున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం నూకలమర్రికి చెందిన పెద్దవేని మల్లయ్య మొదటి భార్యకు ఇద్దరు కుమారులు. ఆమె మృతిచెందడంతో నర్సవ్వను రెండో వివాహం చేసుకోగా ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. నలుగురు కుమారుల మధ్య ఆస్తి పంపకం విషయంలో గొడవ జరిగింది. మొదటి భార్య రెండో కుమారుడు తిరుపతికి ఇచ్చిన 15 గుంటల భూమి విషయంలో మళ్లీ గొడవ జరగగా మల్లయ్య, నర్సవ్వ ఆరునెలల క్రితం తిరుపతిపై దాడిచేశారు. తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చేరి కోలుకున్నాడు. మల్లయ్య, నర్సవ్వపై కేసు నమోదుకాగా అప్పటి నుంచి పరారీలో ఉన్నారు. శుక్రవారం ఎదురుగట్ల నుంచి నూకలమర్రి వెళ్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్సై మారుతి, హెడ్ కానిస్టేబల్ షబ్బీర్, కానిస్టేబుల్ సంపత్, హోంగార్డు రాజినిసీఐ అభినందించారు.

మోదీ సహకారంతో కరీంనగర్‌కు రూ.7వేల కోట్ల నిధులు

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్
- కొత్తపల్లి మండలంలో అభివృద్ధి పనులు ప్రారంభం



లక్ష్మీనరసింహస్వామి గుట్టపైకి వెళ్తున్న ఎంపీ బండి సంజయ్

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గత నాలుగేళ్లలో రూ.7వేల కోట్లకుపైగా నిధులు ఖర్చు చేసినట్లు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ తెలిపారు. జాతీయ రహదారుల నిర్మాణానికి ఏకంగా రూ.4,624కోట్ల నిధులు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. కొత్తపల్లి పట్టణంలో రూ.9 లక్షల వ్యయంతో, మండలంలోని 8 గ్రామాల్లో రూ.11.87 లక్షలతో ఏర్పాటు చేసిన హైమస్ట్ లైట్లను గురువారం సంజయ్ ప్రారంభించారు. నాగులమల్యాలలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ సీఆర్‌ఐఎఫ్ ద్వారా రూ.216కోట్లతో రహదారుల నిర్మాణం, గ్రామీణ సడక్ యోజన కింద రూ.30కోట్ల 39 లక్షలతో గ్రామాల్లో రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం చేపట్టామని, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తీగలగుట్టపల్లి ఆర్‌ఓబీ నిర్మాణం కోసం వందశాతం నిధులు (రూ.154 కోట్లు) మంజూరు చేయించినట్లు తెలిపారు. అమృత్ భారత్ స్కీం కింద కరీంనగర్ రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించేందుకు ఇటీవల 26 కోట్ల 60లక్షల రూపాయలు మంజూరైనట్లు చెప్పారు. పార్లమెంట్ పరిధిలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.711కోట్ల ని.దులు వెచ్చించినట్లు తెలిపారు. కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ కింద రూ.194 కోట్లు, అమృత్ పథకం కింద రూ. 1.17 కోట్లు తీసుకొచ్చామన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి 14, 15వ ఆర్థిక సంఘం ద్వారా 36.84 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 3 వేల ఇండ్ల నిర్మాణానికి రూ.73.15 కోట్లు మంజూరు చేస్తే ఇప్పటి వరకు 264 ఇండ్లు మాత్రమే పూర్తయ్యాయని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయన్నారు. పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, కొత్తపల్లి పట్టణ, మండల శాఖ అధ్యక్షులు కెంచ శేఖర్, కడార్ల రతన్‌కుమార్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గాయాలతోనే బాలిక మృతి?

- లైంగికదాడిపై పోలీసులకు లభించని ఆధారాలు
- బాలికను చితకబాదడం వల్లే ఆత్మహత్యాయత్నం!
- చెరువు, పురుగు మందు షాపుల వద్దకు అందుకే వెళ్లిందా?
- గాంధీ ఆస్పత్రి నివేదిక వస్తేనే నిజం తెలిసేది



బాలిక ఇంటి వద్ద కూలీలు (ఫైల్)

సాక్షిప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన పెద్దపల్లి జిల్లాలో మధ్యప్రదేశ్ బాలిక కేసు మరో మలుపు తిరిగింది. ఆగస్టు 14వ తేదీ రాత్రి బాలికపై సామూహిక లైంగికదాడి జరిగిందని, దాంతో అమ్మాయి అనారోగ్యం పాలై, మరణించిందని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. తాజాగా బాలిక ఒంటిపై గాయాలున్న మాట వాస్తవమే గానీ, లైంగికదాడి జరిగినట్లుగా పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభించలేదన్న విషయం సంచలనం రేపుతోంది. ఈ దుర్ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే రామగుండం పోలీసులు స్పందించారు. గోదావరిఖని, పెద్దపల్లి ఏసీపీలు, పెద్దపల్లి డీసీపీలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసిన సీపీ రెమా రాజేశ్వరి కేసును స్వయంగా పర్యవేక్షించారు. అసలు అనారోగ్యంతో ఉన్న బాలికను గుట్టుచప్పుడు కాకుండా ఎందుకు తరలించాల్సి వచ్చింది? వీరికి వాహనం ఎవరు సమకూర్చారు? తనపై కొందరు లైంగికదాడి జరిపారు.. అంటూ బాలిక చెబుతున్న ఆడియోలో వాస్తవమెంత? తదితర విషయాలపై దాదాపు 48 గంటల సుదీర్ఘ సాంకేతిక, శాస్త్రీయ దర్యాప్తు తర్వాత రామగుండం పోలీసులు ఈ మేరకు నిర్ధారణకు వచ్చారని తెలిసింది.

ఇంట్లో వారే కొట్టారా?

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట శివారులోని అక్కాబావల వద్దకు మధ్యప్రదేశ్ నుంచి బాలిక వచ్చింది. ఆమె మరణానికి ముందు ఒంటిపై తీవ్ర గాయాలయ్యాయి. ఇవి ఎవరు చేశారు? అన్నదానిపై స్పష్టత లేదు. బాలికను కుటుంబసభ్యులు లేదా తెలిసినవారే తీవ్రంగా కొట్టారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆరోజు తనను తీవ్రంగా కొట్టడంపై బాలిక మనస్తాపానికి గురైంది. అది తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేసుకోవాలనుకుందేమోనని అనుమానిస్తున్నారు. బాలిక చివరిసారిగా కనిపించిన పరిస్థితులు ఈ వాదనకు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఆమె ఆగస్టు 14 మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఇంట్లో లేదు. ఆ సమయంలో ఏం చేసింది? అన్నదానిపై పోలీసులు సీసీ ఫుటేజీ ద్వారా అణువణువూ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ క్రమంలో బాలిక పురుగుల మందు షాపుల ముందు, రాత్రి 8 గంటల ప్రాంతంలో సమీపంలోని ఓ చెరువు వద్ద కూడా కనిపించిందని సమాచారం. అర్ధరాత్రి చెరువు వద్ద ఏం చేస్తున్నావని కొందరు మందలించడంతో అక్కడి నుంచి బస్టాండ్ వైపు వెళ్లినట్లు తెలిసింది. ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంది కాబట్టే.. ఈ రెండు ప్రాంతాల్లో కనిపించిందని పోలీసులు భావిస్తున్నారు. ఇంటి నుంచి బస్టాండ్ వద్దకు బాలిక సంచరించిన ప్రాంతాల్లో మొత్తం 15 మంది ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. రాత్రి 11 గంటల తర్వాత ఇంటికి చేరిన బాలిక.. అస్వస్థతకు గురైంది. వెంటనే బాలిక బంధువులు కారు మాట్లాడుకొని, ఆమెను హుటాహుటిన మధ్యప్రదేశ్‌లోని బాల్‌ఘాట్ జిల్లా కజ్రీ గ్రామానికి తరలించారు. మార్గమధ్యలో వాంతులు చేసుకుంది. విషయం తెలుసుకున్న రామగుండం పోలీసులు అక్కడి ఎస్పీని సంప్రదించారు. తొలుత బాలిక మరణించిన విషయాన్ని ధ్రువీకరించుకున్నాక అంత్యక్రియలు జరపకుండా ఆపగలిగారు. అంత్యక్రియలు ఆపేది లేదంటూ ఆమె బంధువులు వాదనకు దిగారు. ఎంతో శ్రమిస్తే గానీ.. వారు దారికి రాలేదు. ఎట్టకేలకు బాలిక మృతదేహానికి అక్కడ స్థానిక ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, తిరిగి సెకండ్ ఒపీనియన్ కోసం గాంధీ ఆస్పత్రికి మరోసారి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

గాయపరిచింది ఎవరు?

బాలిక ఒంటిపై గాయాలున్నాయి తప్పితే, లైంగికదాడి జరిగినట్లుగా ఎలాంటి ఆనవాళ్లు లేవని తెలిసింది. మరి ఆమెను మరణించేంత స్థాయిలో గాయపరిచింది ఎవరు? అసలు ఆగస్టు 14 మధ్యాహ్నం ఏం జరిగింది? బాలిక ఎవరితో ఘర్షణ పడింది? ఆమెపై ఎవరు దాడి చేసి ఉంటారు? అన్న విషయాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సామూహిక లైంగికదాడి జరిగిందని ప్రచారం కావడం, అందులోనూ బాధితురాలు మైనర్ కావడంతో విషయాన్ని తీవ్రంగా పరిగణించారు. అన్ని బృందాల పోలీసులు అత్యంత గోప్యత పాటిస్తున్నారు. ఇంతవరకూ దర్యాప్తు పురోగతిలో ఏ విషయాన్ని మీడియాతో పంచుకోలేదు. ఈ క్రమంలోనే అమ్మాయి మాట్లాడిందని చెబుతున్న ఆడియో విడుదల చేసిన వారిని అదుపులోకి తీసుకొని, ప్రశ్నించినట్లు తెలిసింది. వారు చెప్పే సమాధానాలు పొంతన లేకుండా ఉన్నాయని సమాచారం. గాంధీ ఆస్పత్రి నుంచి నివేదిక వస్తేగానీ.. పోలీసులు ఈ విషయంలో ఎలాంటి ప్రకటన చేసేలా లేరు. ఆ నివేదికలో ఏం ఉంటుందన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.